
సూరవరం రోడ్డులో అలంకరించిన లక్ష్మీ గణపతి ఆలయం


తుని మార్కెట్లో పూజా సామగ్రి కొనుగోలు చేస్తున్న దృశ్యం


ఒమ్మంగిలో అమ్మకానికి ఉంచిన మట్టి గణపతి ప్రతిమలు


ప్రత్తిపాడు మార్కెట్‌లో పత్రి కొనుగోలు చేస్తున్న ప్రజలు

శుక్లాంబరధరం

- గణపతి ఉత్సవాలకు పటిష్ఠ ఏర్పాట్లు
- మార్కెట్‌లో ధరల హోరు
- కిటకిటలాడిన దుకాణాలు

తుని/ప్రత్తిపాడు/తుని రూరల్/ఏలేశ్వరం/జగ్గంపేట: విఘ్నాలు తొలగించే విఘ్నపతి, తొలిదేవుడు వినాయకుని పూజకు పల్లెలు సిద్ధమయ్యాయి. తెలుగు పండగలకు ప్రథమమైన వినాయక చవితిని వాడవాడలా చిన్నా, పెద్దా తేడా లేకుండా సాంప్రదాయ బద్ధంగా నిర్వహించుకోవడం ఆనవాయితీగా వస్తుంది. మార్కెట్‌లో మాత్రం పూజా ద్రవ్యాలతో పాటు, పిండి వంటలకు వినియోగించే సామాగ్రి ధరలు అందుబాటులో లేవు. ఈ ఏడాది యాపిల్, బత్తాయి, మొక్కజొన్న, వెలగ, సీతాఫలం, జామ, ద్రాక్ష, చామంతి, అరటి, కొబ్బరి, పత్రుల ధరలు రెట్టింపయ్యాయి. మార్కెట్‌లోకి వెళితే రూ.600లు కూడా సరిపోవడం లేదని కొనుగోలుదారులు అంటున్నారు. మొదటగా వచ్చే పండగ కాబట్టి చేతిలో సొమ్ము లేకపోయినా ఘనంగానే జరపడానికి ప్రజలు సిద్ధమయ్యారు. మంగళవారం తుని మెయిన్‌రోడ్డు, మార్కెట్ యార్డులో ఉదయం నుంచి సాయంత్రం వరకు వివిధ గ్రామాల నుంచి వచ్చిన కొనుగోలుదారులతో కిక్కిరిసింది. పోలీసులు ట్రాఫిక్‌ను వేరే రూట్‌లకు మళ్లించారు. అయినా గొల్ల అప్పారావు సెంటర్‌లో తీవ్ర రద్దీ నెలకొంది.

పెరిగిన విగ్రహాల ధరలు

ఈ ఏడాది వినాయక విగ్రహాల ధరలు భారీగా పెరిగాయి. గతేడాది రూ.500 ఉండే విగ్రహం ప్రస్తుతం రూ.1500లకు చేరుకుంది. మట్టితో తయారు చేసిన విగ్రహాలకు డిమాండ్ ఎక్కువగా ఉంది. బుధవారం ఉదయం నుంచే విగ్రహ ప్రతిష్ఠ, పూజలు చేసేందుకు వీలుగా ఉత్సవ కమిటీల ప్రతినిధులు పందిళ్లను సుందరంగా అలంకరించారు. ఒక రోజు ముందే గణనాథుల విగ్రహాలను ఊరేగింపుగా తీసుకొచ్చి పందిళ్లలో ఉంచారు. బుధవారం శాస్త్రోక్తంగా అర్చకులచే పూజలు నిర్వహించి, ఉత్సవాలను కొనసాగించనున్నారు. ఎస్.అన్నవరం, డి.పోలవరం, హంసవరం, వి.కొత్తూరు, లోవకొత్తూరు, రేఖవానిపాలెం, కుమ్మరిలోవ, ఎస్.సూరవరం, కె.ఓ.మల్లవరం, టి.తిమ్మాపురం తదితర గ్రామాల్లో ప్రత్యేక పందిళ్లు వేశారు. దేవదాయశాఖ ఆధ్వర్యంలో తలుపులమ్మ లోవ దేవస్థానం, సచ్చిదానంద సరస్వతీ మహాస్వామి పర్యవేక్షణలో తపోవనం ఆశ్రమంలో ఉత్సవాలు నిర్వహించనున్నారు. గణపతి నవరాత్రుల్లో ప్రజలకు ఇబ్బంది లేకుండా కమిటీ సభ్యులు చూసుకోవాలని తుని పట్టణ సీఐ గీతా రామకృష్ణ విజ్ఞప్తి చేశారు.

వాడవాడలా వేడుకలకు సమాయత్తం

ఏలేశ్వరంలోని పాతబస్టాండ్, అడ్డతీగల రోడ్డు, నర్సీపట్నం రోడ్, లింగంపర్తి రోడ్, తోటవీధి, పెద్ద వీధి, పల్లపువీధి, పలు కాలనీల్లో వినాయకుని విగ్రహాలను నెలకొల్పనున్నారు. మండలంలోని లింగంపర్తి, యర్రవరం, సిరిపురం తదితర గ్రామాల్లో చవితి వేడుకలు ఘనంగా ప్రారంభం కానున్నాయి. స్థానిక హనుమాన్ జంక్షన్ వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన దుకాణాల వద్ద భక్తులు పండ్లు, పత్రి కొనుగోలు చేస్తుండటంతో రద్దీ ఏర్పడింది. చినుకులతో చవితి ఏర్పాట్లు చేసేందుకు ఇబ్బంది కలిగింది. ఆలయాల వద్ద వర్షం ఆటంకంగా మారింది. దీంతో కమిటీ సభ్యులు అవస్థలు పడ్డారు.

ప్రత్తిపాడు: వినాయక చవితి సందర్భంగా విగ్రహాల ఏర్పాటుకు యువత సన్నాహాలు చేస్తోంది. వినాయక మండపాలు ముస్తాబయ్యాయి. వీటితో పాటు రామ కోవెల, కమ్యూనిటీ హాళ్లు కూడా చవితి వేడుకలకు వేదికలవుతున్నాయి. గ్రామాల్లో చిన్న పిల్లలు సొంతంగా చిన్న చిన్న విగ్రహాలను ఏర్పాటు చేసుకోవడానికి చేస్తున్న ప్రయత్నాలు ఆకట్టుకుంటున్నాయి.


జగ్గంపేటలో వినాయకుడి విగ్రహాలు కొనుగోలు చేస్తున్న దృశ్యం

మట్టి వినాయకుడినే ఎందుకు పూజించాలంటే..

వినాయకుడంటే తత్వగణం కలవాడు. ఆయన పృధ్వీమయం. పృథ్వీమయం అంటే భూమి. అందుకే భూమిలో లభించే మట్టితోనే ఆయన ప్రతిమను తయారుచేసి పూజించాలని పండితులు పేర్కొంటున్నారు. మట్టితో తయారు చేసిన విగ్రహం ఎక్కువ కాలం ఉండదు కాబట్టి నిమజ్జనం చేయాలని చెబుతున్నారు. ప్రత్తిపాడు మార్కెట్‌లో ఆరు అంగుళాల నుంచి రెండు అడుగుల ఎత్తు వరకు ఉన్న మట్టి విగ్రహాలు రూ. 30 నుంచి 1,000 వరకు ధర పలుకుతున్నాయి. గతేడాది కంటే ప్రస్తుతం ధరల పెరుగుదల ప్రజలను కాస్త ఇబ్బందులకు గురిచేసింది. చిరుజల్లుల్లోనే మార్కెట్ కొనసాగింది.

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని గ్రామాల్లో వాడవాడల చలువ పందిళ్లు, మండపాలు సిద్ధం చేశారు. మండపాల వద్ద విద్యుత్ దీపాలంకరణలు, ప్లెక్సీలు ఏర్పాటు చేశారు. పలు ఆలయాలను రంగులతో అత్యంత సుందరంగా ఆయా ఆలయ కమిటీలు తీర్చిదిద్దాయి. చవితి తొమ్మిది రోజులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేందుకు నిర్వహకులు ఇప్పటికే సన్నహాలు చేసుకున్నారు. మండలంలో డిమాండ్ తగ్గట్టుగా గణేష్ విగ్రహాలను అమ్మకం దారులు సిద్ధం చేశారు. అన్ని వర్గాల వారికీ తగ్గట్టుగా విగ్రహాలు వివిధ సైజుల్లో తీర్చిద్దారు. గతేడాది కన్నా ఈ ఏడాది విగ్రహాల ధరలు భారీగా పెరిగాయి. ప్రస్తుతం మట్టి గణపతి విగ్రహాల అమ్మకాలు భారీగా పెరిగాయి. ఇళ్లల్లో పూజకు మట్టి గణపతి విగ్రహాలనే ప్రజలు ఎక్కువగా వినియోగిస్తున్నారు. గణేష్ మండపాలు, పందిళ్ల ఏర్పాటుకు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని ప్రత్తిపాడు సీఐ బి.సూర్య అప్పారావు తెలిపారు.

జగన్‌ను కలిసిన ముద్రగడ గిరిబాబు


తాడేపల్లిలో జగన్‌ను కలిసిన గిరిబాబు

కిర్లంపూడి: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తాడేపల్లిలో వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ కో–ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. తన తండ్రి ముద్రగడ పద్మనాభం ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించి ఎప్పటికప్పుడు యోగక్షేమాలు తెలుసుకున్నందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ముద్రగడ పద్మనాభం సంపూర్ణ ఆరోగ్యంతో ప్రజాక్షేత్రంలోకి వచ్చి సేవలందిస్తారని, ఆరోగ్యం మెరుగుపడే వరకు ప్రత్యేక శ్రద్ధ వహించాలని జగన్ తనకు చెప్పినట్టు తెలిపారు. నియోజకవర్గంలోని పార్టీ బలోపేతానికి కష్టపడి పనిచేయాలని ఆయన చెప్పారన్నారు. ఆయనను కలిసిన వారిలో గౌతు స్వామి ఉన్నారు.

స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

గోకవరం: మండలంలోని వెదురుపాకలో మంగళవారం స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం జరిగింది. స్థానిక సచివాలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే నెహ్రూ పలువురు లబ్ధిదారులకు వీటిని పంపిణీ చేశారు. ఈ కార్డుల ద్వారా లబ్ధిదారులు సరకులు తీసుకున్న వెంటనే రాష్ట్ర ప్రధాన కార్యాలయానికి సమాచారం అందుతుందన్నారు. లబ్ధిదారుడు క్యూఆర్ కోడ్ స్కానింగ్‌తో సరకులు తీసుకున్న సమాచారం మొత్తం తెలుసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, గ్రామస్తులు, అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ముదునూరి ఆర్థిక సాయం


ఒమ్మంగిలో బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న మురళీకృష్ణంరాజు

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ఒమ్మంగిలో బాధిత కుటుంబాలను వైఎస్సార్ సీపీ నరసాపురం పార్లమెంటరీ నియోజకవర్గ పరిశీలకుడు ముదునూరి మురళీకృష్ణంరాజు పరామర్శించి ఆర్థిక సాయాన్ని అందజేశారు. గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు గంట బాబురావు కాలికి, ముమ్మిడి చక్రారావు బ్రెయిన్‌కి ఇటీవల ఆపరేషన్ చేయించుకున్నారు. వారి ఇళ్లకు మురళీకృష్ణంరాజు వెళ్లి పరామర్శించారు. అనంతరం గంట బాబురావుకి రూ.10 వేలు ఆర్థిక సాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు గంట గంగబాబు, తోతేటి శేఖర్, గంట బుజ్జి, రామిశెట్టి దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

కోడి పందేల శిబిరంపై పోలీసుల దాడి

శంఖవరం: మండలంలోని నెల్లిపూడి శివారులో రహస్యంగా నిర్వహిస్తున్న కోడి పందేల శిబిరంపై అన్నవరం పోలీసులు దాడి చేశారు. ఎస్సై శ్రీహరిబాబు ఆధ్వర్యంలో పోలీసులు దాడులు నిర్వహించి ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.2,650 నగదు, 15 బైక్‌లు, మూడు కోడి పుంజులు, రెండు కత్తులు స్వాధీనం చేసుకున్నారు. స్థానిక టీడీపీ నేతల హస్తంతోనే కోడి పందేలు నిర్వహిస్తున్నారని, కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక జూదాలు ఎక్కువైనట్లు కొందరు విమర్శిస్తున్నారు. జూదాలు ఎక్కడ నిర్వహించిన కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు.

ఎంపీపీ స్కూల్ హెచ్‌ఎం మృతి

తొండంగి: మండలంలోని బెండపూడి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం పి.కుమారస్వామి అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన మండలంలోని అద్దరిపేట జెడ్పీ హైస్కూల్లో మ్యాథ్స్ స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేశారు. అనంతరం బెండపూడి స్కూల్ హెచ్‌ఎంగా బాధ్యతలు స్వీకరించారు. గత కొద్ది నెలలుగా అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్న ఆయన మంగళవారం కాకినాడలో మృతి చెందినట్టు పాఠశాల ఉపాధ్యాయ బృందం తెలిపింది.

రోగులకు పండ్లు పంపిణీ

ఏలేశ్వరం: పట్టణ ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి జన్మదినం సందర్భంగా పట్టణంలో మంగళవారం రోగులకు రొట్టెలు, పండ్లు పంపిణీ చేశారు. స్థానిక ప్రభుత్వాసుపత్రిలో వీటిని రోగులకు అందజేశారు. అనంతరం స్థానిక భవిత కేంద్రంలో దివ్యాంగులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో సుంకర సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

శంఖవరం: మండలంలోని పి.మల్లాపురంలో సర్పంచ్ గుండు నాగదేవి ఆధ్వర్యంలో రిఫరల్ ఆసుపత్రి వైద్యులు ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఉచిత వైద్య శిబిరంలో 200 మంది రోగులకు పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. వాతావరణ మార్పుల కారణంగా అధికంగా జ్వరాలు రావడం జరుగుతుందన్నారు. రోగులు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పసగడుగుల నాగేశ్వరరావు, వైద్యులు వజ్రాని, విష్ణు, ఫరూక్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి


జగ్గంపేట పార్టీ కార్యాలయంలో మాట్లాడుతున్న తోట నరసింహం

జగ్గంపేట: నియెజకవర్గంలో వైఎస్సార్ సీపీ బలోపేతానికి మరింత కృషి చేయనున్నట్లు మాజీ మంత్రి, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ తోట నరసింహం తెలిపారు. జగ్గంపేట పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ, మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సూచనల మేరకు ఇప్పటికే నియోజకవర్గ, మండలస్థాయి కమిటీలు ఏర్పాటు చేశామని చెప్పారు. త్వరలో మహిళలతో ప్రత్యేక సదస్సు ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. మహిళా శక్తి పార్టీకి ఎంతో ముఖ్యమని, దీనికి అనుగుణంగా మహిళలతో ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేస్తామని చెప్పారు. నియోజకవర్గ ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర వైఎస్సార్ సీపీ యువజన విభాగం ప్రధాన కార్యదర్శి తోట రాంజీ, పార్టీ నేతలు కరుటూరి శ్రీనివాస్, రామకుర్తి జగాల్, కరుటూరి వీర్రాజు, వరుపుల సూరిబాబు, బూమాడ గణపతి తదితరులు పాల్గొన్నారు.

మట్టి గణపతితో కాలుష్య నివారణ


విద్యార్థులకు మట్టి గణపతి ప్రతిమలు పంపిణీ చేస్తున్న డీఈఓ రమణ, హరిప్రసాద్

తొండంగి: ఎటువంటి రసాయనాలు వినియోగించని మట్టి గణపతిని పూజించడం ద్వారా కాలుష్యాన్ని నివారించడంతోపాటు, పర్యావరణాన్ని రక్షించుకోవచ్చని పెరుమాళ్లపురం జిల్లా పరిషత్ హైస్కూల్ హెచ్‌ఎం సత్యనారాయణ అన్నారు. మంగళవారం పాఠశాల ప్రాంగణంలో వినాయక చవితి పండుగను పురస్కరించుకొని విద్యార్థులకు మట్టి గణపతి తయారీ, చిత్రలేఖనం వంటి పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎస్‌ఎంసీ చైర్మన్ రాంబాబు, ఉపాధ్యాయులు మరువాడ శ్రీదేవి, టి.శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

మట్టి వినాయక ప్రతిమల పంపిణీ

ఏలేశ్వరం: లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పట్టణంలో మంగళవారం మట్టి వినాయక ప్రతిమలను ఉచితంగా పంపిణీ చేశారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు అనసూరి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో సుమారు 200 విగ్రహాలను అందజేశారు. ఆయన మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి వినాయక ప్రతిమలనే వినియోగించాలన్నారు. స్థానిక బాలాజీచౌక్ సమీపంలోని తిరుమల క్లాత్ అండ్ రెడిమేడ్ షోరూం ఆధ్వర్యంలో మట్టి వినాయక ప్రతిమలను ఉచితంగా పంపిణీ చేశారు.

అన్నవరం: మట్టి గణపతి విగ్రహాలతో వినాయక చవితి వేడుకలు ఘనంగా నిర్వహించుకొని పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని శంఖవరం ఎంఈఓ రమణ కోరారు. మంగళవారం ఆయన స్థానిక శ్రీసత్యసాయి విద్యావిహార్ స్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపకులకు మట్టి గణపతులను అందచేశారు. కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ హరిప్రసాద్, ప్రిన్సిపాల్ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

జగ్గంపేట: వినాయక చవితి పూజకు వివిధ రకాల ఆకులతో కూడిన పత్రి ఎంతో ప్రధానమైనది. చవితి సందర్భంగా పత్రికి డిమాండ్ పెరిగిపోయింది. పూజకు అవసరమైన మామిడి ఆకులతో సహా పత్రిని సేకరించి జగ్గంపేటకు చెందిన పాలిక అప్పారావు ఉచితంగా గ్రామస్తులకు పంపిణీ చేయటం కొన్నేళ్లుగా కొనసాగుతోంది. మంగళవారం జోరు వర్షంలో జగ్గంపేట శ్రీరామ్‌నగర్, శివాలయం వీధి, జ్యోతుల నెహ్రూ కాలనీ వినాయక మండపాలకు పత్రిని అందజేశారు.

గండేపల్లి: పర్యావరణ హిత మట్టి వినాయక ప్రతిమలను ఆదిత్య యూనివర్శిటీలో తయారు చేసి పంపిణీ చేశారు. యూనివర్శిటీ జాతీయ సేవా పథకం, రోట్రాక్ట్ క్లబ్ ఆధ్వర్యంలో వాటిని తయారు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పలువురు వక్తలు పండగ పర్యావరణ హితంగా జరుపుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటి ప్రో.ఛాన్సలర్ శ్రీనివాసరెడ్డి, పలువురు ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

తొండంగి: బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తన ప్రభావంతో మండలంలోని మంగళవారం వర్షం కురిసింది. తెల్లవారుజాము నుంచి సాయంత్రం వరకూ తెరిపివ్వకుండా వర్షం కురవడంతో ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మరో రెండు రోజులపాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ ప్రకటించింది. దీని ప్రభావంతో దానవాయిపేట, అద్దరిపేట, కొత్తచోడిపల్లిపేట సముద్ర తీరప్రాంతంలో సముద్రపు అలల ఉధృతి ఎక్కువగా ఉంది. దీంతో మత్స్యకారులంతా అప్రమత్తంగా ఉండాలని తుని మత్స్యశాఖ అభివృద్ధి అధికారి ఉమామహేశ్వరరావు తెలిపారు.

తెరిపివ్వని వర్షం

ఏలేశ్వరం: అల్పపీడనం ప్రభావంతో నియోజకవర్గ వ్యాప్తంగా మంగళవారం వర్షం కురిసింది. అర్ధరాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం పడింది. దీంతో ప్రజల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. వర్షాలకు జనజీవనం స్తంభించింది. పలు రహదారులపై నీరు నిలిచిపోయింది. మరో రెండు రోజులపాటు వర్షాలు ఉంటాయని వాతావరణ శాఖ చెప్పడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ప్రైవేట్, ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లేందుకు ఇబ్బందులు పడ్డారు. వర్షాలు పంటలకు అనుకూలించడంతో రైతులు ఆనందం వ్యక్తం చేశారు.

రత్నగిరిపై నేటి నుంచి గణపతి నవరాత్రులు

అన్నవరం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరంలోని శ్రీవీర వేంకట సత్యనారాయణ స్వామి దేవస్థానంలో బుధవారం వినాయక చవితి ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. సత్యదేవుని ఆలయంలో అనివేటి మండపంలో గణపతిని ప్రతిష్ఠించి తొమ్మిది రోజులు నవరాత్రి పూజలు ఘనంగా చేయనున్నారు. ఆలయం దిగువన యంత్రాలయంలో గణపతిని ప్రతిష్ఠించి పూజలు చేయనున్నారు. అదే విధంగా స్మార్త ఆగమ పాఠశాలలో కూడా గణపతిని నిలిపి పూజ చేయనున్నారు.

గోకవరం: పట్టణంలో వినాయకుని విగ్రహాల అమ్మకాలు జోరుగా సాగాయి. విఘ్నాలు తొలగించే వినాయకుని చవితి వేడుకలకు భారీ ఏర్పాట్లు పూర్తి చేశారు. విగ్రహాలను కొనుగోలు చేసేందుకు షాపుల వద్దకు జనం ఎగబడ్డారు. వీటిని కొనుగోలు చేసిన అనంతరం ట్రాక్టర్లు, వ్యాన్‌లు వివిధ రకాల వాహనాల్లో తరలించేందుకు చిన్నా, పెద్దా తరలివచ్చారు.

తహసీల్దార్, ఎంపీడీఓకు ప్రశంసలు


సూర్యప్రభకు అవార్డు అందజేస్తున్న కలెక్టర్

ప్రత్తిపాడు: మండల తహసీల్దార్ సూర్యప్రభ, ఎంపీడీఓ కుమార్‌బాబుకు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ నుంచి అవార్డులు అందుకున్నారు. జిల్లా కేంద్రంలో మంగళవారం కలెక్టర్ సగిలి షాన్‌మోహన్ అవార్డులు అందించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఇటీవల రక్తదాన శిబిరం నిర్వహించినందుకు ఇండియన్ రెడ్‌క్రాస్ సంస్థ ఈఅవార్డులు అందించినట్టు డిప్యూటీ తహసీల్దార్ పుణ్యవతి తెలిపారు.

ముగిసిన ఏఐ పరిశోధన శిక్షణ

గండేపల్లి: మండలంలో సూరంపాలెం ఆదిత్య యూనివర్శిటీలో ఏఐ సాధనాలు, విద్య, పరిశోధన శిక్షణా కార్యక్రమం మంగళవారం ముగిసింది. ఆన్‌లైన్ సర్టిఫికేషన్ ప్రోగ్రామ్ ద్వారా విద్యార్థులు పరిశ్రమ నిపుణులు, ఏఐ సాధనాలు, కంప్యూటింగ్ రంగంలో సిద్ధాంతాలు వంటి విషయాలను సూత్రంగా అర్థం చేసుకోవడంతోపాటు ప్రాక్టికల్ డెమోలకు ప్రత్యక్షంగా లబ్ధిపొందినట్లు డిప్యూటి వైస్ ఛాన్సలర్ శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈ శిక్షణా కార్యక్రమం ద్వారా విద్యార్థులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం మీద అవగాహన పెరిగిందని ఆయన తెలిపారు. శిక్షణ ముగింపు కార్యక్రమంలో ఆదిత్య యూనివర్శిటికి చెందిన ప్రొఫెసర్లు, ప్రముఖులు పాల్గొన్నారు.

రైతులకు యూరియా పంపిణీ

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ధర్మవరం రైతు సేవా కేంద్రంలో 278 మంది రైతులకు 20 టన్నుల యూరియాను పంపిణీ చేశారు. మండల వ్యవసాయ అధికారి జోకా అమృత మాట్లాడుతూ, ఖరీఫ్‌కు ఎటువంటి ఇబ్బంది లేకుండా ఎరువులను సిద్ధం చేసినట్లు తెలిపారు. మండల వ్యాప్తంగా రైతు సేవా కేంద్రాల్లో ఎరువులను అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు తెలిపారు.

మానసిక వికలాంగులకు అండగా ఉండాలి

ప్రత్తిపాడు రూరల్: మానసిక వికలాంగుల పట్ల మానవతాదృక్పదంతో మెలగాలని భారత చైతన్య యువజన (బీసీవై) పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గొంప శివకుమార్ యాదవ్ అన్నారు. పులిమేరు శాంతి వర్ధిన విభిన్న ప్రతిభావంతుల ప్రత్యేక ఆశ్రమ పాఠశాలలో ఆయన జన్మదినాన్ని పురస్కరించుకుని మానసిక వికలాంగులకు రాత్రి భోజనాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో బీసీవై పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎరువులు సరఫరా చేయరా?


ప్రత్తిపాడులో కార్యకర్తల ఆత్మీయ కలయికలో పాల్గొన్న ముద్రగడ గిరిబాబు

ప్రత్తిపాడు: రైతులకు అవసరమైన ఎరువుల్లో యూరియాను ప్రభుత్వం ఎందుకు సరఫరా చేయలేకపోతుందని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో–ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు ప్రశ్నించారు. స్థానిక వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు బెహరా దొరబాబు స్వగృహంలో మంగళవారం జరిగిన పార్టీ కార్యకర్తల ఆత్మీయ కలయికలో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ, ఖరీఫ్‌లో రైతులకు అవసరమైన యూరియా దొరక్కపోవడం వల్ల అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నియోజకవర్గ రైతాంగానికి కొండంత యూరియా అవసరమైతే గోరంత సరఫరా చేస్తున్నారని దుయ్యబట్టారు. రైతులను ఆదుకోవడంలో చంద్రబాబు ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని ఆరోపించారు. గత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ఎరువుల కోసం రైతు రోడ్డెక్కిన దాఖలాలు లేవన్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతు తన గ్రామంలోనే ఇబ్బందులు లేకుండా ఎరువులు పొందిన విషయాన్ని గుర్తు చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రైతుసేవా కేంద్రాల ద్వారా సకాలంలో ఎరువులు సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బెహరా రాజరాజేశ్వరి, ఎంపీపీ కాంతి సుధాకర్, మండల పార్టీ కన్వీనర్ రామిశెట్టి బులిరామకృష్ణ, ఎంపీటీసీ సింద్రపు భాస్కరరావు, మాజీ ఉపసర్పంచ్ చిలకమర్తి వెంకటరమణ, పార్టీ నాయకులు బండారు మూర్తి, గౌతు స్వామి, ఏడిద రెడ్డినాయుడు తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతతో అధిక దిగుబడి

కిర్లంపూడి: పరిశుభ్రతతోనే పట్టు పరిశ్రమలో అధిక దిగుబడులు సాధించవచ్చని జిల్లా పట్టు పరిశ్రమ శాఖ అధికారి రాజేంద్ర ప్రసాద్ సూచించారు. మండలంలోని సోమవరం గ్రామంలో మంగళవారం సెంట్రల్ సిల్క్ బోర్డు సైంటిస్టు భువనేశ్వరి ఆధ్వర్యంలో పట్టు పరిశ్రమ నిర్వాహకులకు మేరా రేషం మేరా అభిమానం (నా పట్టు నా అభిమానం) కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిగా రాజేంద్రప్రసాద్ పాల్గొని పట్టు పరిశ్రమ రైతులకు పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. రియరింగ్ షెడ్‌ను పరిశుభ్రంగా ఉంచేందుకు ఐదు కేజీల బ్లీచింగ్, అరకేజి గొల్లముగ్గును 200 లీటర్ల నీటిలో కలిపి ఆ ద్రావణంతో షెడ్‌ను శుభ్రం చేసుకోవాలన్నారు. భువనేశ్వరి మాట్లాడుతూ, ప్రభుత్వ గుర్తింపు పొందిన డిసిన్ఫెక్ట్స్‌తో మాత్రమే శుభ్రం చేయాలన్నారు. ప్యూపాదశ పూర్తయిన తర్వాతే పట్టు గూళ్లను మార్కెట్‌కు పంపడం వల్ల రైతులు అధిక ఆదాయం పొందవచ్చన్నారు. సెరికల్చర్ అధికారి సత్యన్నారాయణ, డీవీ రమణ, సిబ్బంది పాల్గొన్నారు.


సోమవరంలో పట్టు పరిశ్రమ నిర్వహణపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

గణపతి ఆకృతిలో విద్యార్థులు

జగ్గంపేట: వినాయక చవితి సందర్భంగా వైఎస్సార్ సీపీ జిల్లా బూత్ కమిటీ అధ్యక్షుడు, వివేకనంద విద్యాసంస్థల అధిపతి ఒమ్మి రఘురాం ఆధ్వర్యంలో మట్టి వినాయక ప్రతిమలు విద్యార్థుల చేత తయారు చేయించి పంపిణీ చేశారు. పర్యావరణ పరిరక్షణకు మట్టితోనే వినాయక విగ్రహాలను తయారు చేయడం మంచిదని చెప్పారు. గణపతి ఆకృతిలో విద్యార్థులను ఉంచి గణపతి నవరాత్రుల ప్రాధాన్యతను వివరించారు.



పారిశ్రామిక, విద్యారంగ మార్పులను గమనించాలి

- అటల్ ఇంక్యుబేషన్ సెంటర్ ఎలీప్ వీహబ్ చీఫ్ డాక్టర్ జహురుల్లా

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): అధ్యాపకులు, విద్యార్థులు నిరంతరం పరిశ్రమ, విద్యారంగంలో వస్తున్న మార్పులను గమనించాలని అటల్ ఇంక్యుబేషన్ సెంటర్ ఎలీప్‌వీహబ్ చీఫ్ డాక్టర్ జహురుల్లా ఎస్‌ఎండీ పేర్కొన్నారు. జేఎన్‌టీయూకేలో అటల్ ఇంక్యుబేషన్ సెంటర్ ఎలీప్‌వీ హబ్, నీతి ఆయోగ్, మైటీ స్టార్టప్ హబ్ సహకారంతో ఇండస్ట్రీ 4.0, 5.0 సాంకేతిక పరిజ్ఞానం, యాక్సలరేషన్ సహాయం అనే అంశంపై అవగాహన సదస్సు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జహురుల్లా ఎస్‌ఎండీ తన 17 ఏళ్ల అనుభవాన్ని పంచుకుంటూ పరిశ్రమలు, పరిశోధన విద్యారంగంలో వచ్చిన మార్పులను యువతకు వివరించారు. ఇండస్ట్రీ 4.0 ప్రాముఖ్యత, స్టార్టప్‌లకు అందే సహకారం, నైపుణ్యాభివృద్ధి అంశాలపై వివరించారు. జేఎన్‌టీయూకే వీసీ సీఎస్ఆర్‌కే ప్రసాద్ మాట్లాడుతూ విద్యాసంస్థల్లో కేవలం బోధన, పరిశోధన పరిమితులే కాకుండా ఆవిష్కరణ, వినూత్న ఆలోచనల ద్వారా విద్యార్థులు, అధ్యాపకులు ప్రామాణికతతో కూడిన పరిశోధనకు ప్రోత్సాహం ఇవ్వాలన్నారు. అనంతరం జహరుల్లా ఎస్‌ఎండీని సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఇన్నోవేషన్ సెంటర్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎ.గోపాలకృష్ణ, ప్రొఫెసర్ కృష్ణప్రసాద్, రామలింగరాజు పాల్గొన్నారు.


జహురుల్లా ఎస్‌ఎండీని సత్కరిస్తున్న వీసీ ప్రసాద్, డైరెక్టర్ గోపాలకృష్ణ